నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఆగస్టు 20, 2024 | www.navatelangana.com

ఆదివాసుల ఆధ్వర్యంలో నోవాల్ పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసులు ప్రకృతిని ఆరాధిస్తూ తమ పండగలను జరుపుకుంటారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో మెస్రం వంశీయుల ఆధ్వర్యములో నోవాల్(కొత్త పంటలు) పండగను పూజారి హన్మంతు, పటేల్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ముందుగా నైవేద్యం చేసి తమ కుల దేవత నాగోబాకు సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. శ్రావణ మాసంలో కొత్త పంటలైన పెసర, మినుము, మక్కా కంకులు తదితర పంటలు తినే ముందు ఈ నోవాల్ పూజను జరుపుకోవడం వారి సాంప్రదాయం. ఈ పూజల అనంతరం కొత్త పంటలను భుజించడం ఆనవాయితీగా వస్తోంది.



సమస్య తెలిసిన వెంటనే స్పందించిన కౌన్సిలర్

ఖానాపూర్‌టౌన్ : ఇంద్రానగర్ ప్రాంతంలోని గంగపుత్ర కాలనీకి తాగునీరు అందించే బోరు చెడి పోవడంతో తాగు నీటి సమస్య తలెత్తింది. రాఖీ పండుగ రోజు కావడంతో బోరు పంపు రిపేరు చేసే మెకానిక్ లేక కాలనీ ప్రజలు తాగు నీరు కోసం ఇబ్బంది పడ్డారు. సమస్యను తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ పరిమి లత సురేష్ వెంటనే స్పందించి పాత బోరు పంపు స్థానంలో కొత్త బోరు పంపును ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు. అలాగే ఇటీవల వార్డు పరిధిలోని కరీం కాలనీలో రోడ్డు బాగా లేక వర్షం నీరు నిలిచి పోవడంతో సొంత డబ్బులు రూ.3వేలు వెచ్చించి రోడ్డుపై మొరం పోయించారు. స్థానిక సమస్యల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించే కౌన్సిలర్ లత సురేష్ పనితీరును పలువురు మెచ్చుకుంటున్నారు.



బహుజన వీరుడు పాపన్నగౌడ్

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ -ముథోల్

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముధోల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. నాటి పాలకుల అరాచకాలను అణిచి వేసేందుకు పుట్టిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గుర్తు చేశారు. మహనీయులు అందరి కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. అన్నివర్గాల వారు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని, ప్రజాస్వామిక స్ఫూర్తితో పోరాడడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రతిఒక్కరూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్, బీజెపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న, వైద్యులు రామకృష్ణగౌడ్, మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, మాజీ ఎంపిటిసి దేవోజీ భూమేష్, పిఎసిఎస్ డైరెక్టర్ సుదర్శన్, నాయకులు నర్సాగౌడ్, పోతన్న యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన బీపీఎం మృతి



నవతెలంగాణ-జన్నారం

అప్పుల వారి వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం చేసిన బీపీఎం వంగపెల్లి శ్రీనివాస్(40) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని బాదంపెల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ పొనకల్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పని చేస్తున్నాడు. బాదంపల్లి గ్రామానికి చెందిన శ్రీపతి ఆనందం వద్ద రూ.11లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందులోంచి రూ.4లక్షలు తిరిగి ఇచ్చేశాడు. వీటిని వడ్డీ కింద జమ చేసుకున్నానని, ఇంకా రూ.11లక్షలు అసలు ఇవ్వాలని ప్రతిరోజూ ఇంటికి వచ్చి వేధించాడు. అంతేకాకుండా అప్పు తీర్చకుంటే పురుగులమందు తాగి చచ్చిపోవాలని, లేకుంటే చంపేస్తానని వేధింపులకు గురి చేయడంతో ఈ నెల 8న శ్రీనివాస్ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం నిర్మల్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా జైపాల్

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వల్లపు జైపాల్ పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ మండలానికి ప్రాధాన్యత ఇచ్చినందుకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా దాసరి రమేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వరరావు హర్షం వ్యక్తం చేస్తూ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తమ సంఘం అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు సంఘం పని చేస్తుందని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం 010 పద్దు ద్వారా జీతాల చెల్లించాలని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. జైపాల్‌కు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరణికోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్ అభినందనలు తెలిపారు.

బదిలీపై వచ్చిన ఏఈఓకు సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

ఏఈఓగా బదిలీపై వచ్చిన దేవేందర్‌కు బీజెపి నాయకులు సన్మానం చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు సోమవారం మండల కేంద్రంలో శాలువాతో సన్మానం చేశారు. వ్యవసాయ పరంగా రైతులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందే విధంగా వారికి అవగాహన కల్పించాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో బిజెపి నాయకులు రాథోడ్ బిక్కు ఉన్నారు.

డెంగ్యూ కలకలం..!

- పల్లెల కంటే పట్టణంలోనే అధిక వ్యాప్తి
- ఆదిలాబాద్ పట్టణంలో ఏకంగా 34 కేసులు నమోదు
- నివారణకు ప్రత్యేక బృందాల నియామకం
- జ్వరాల విజృంభణతో చితికిపోతున్న పేదలు

జిల్లాలో డెంగ్యూ జ్వరాలు కలకలం రేపుతున్నాయి. రోజురోజుకు వీటి సంఖ్య పెరగడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీని భారిన పడిన జ్వర బాధితులు సైతం భయకంపితులవుతున్నారు. పారిశుధ్య లోపం.. నీటి నిల్వ కారణంగా ఈ డెంగ్యూ దోమలు వృద్ధి చెంది మనుషులను కాటేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పల్లెల కంటే పట్టణంలోనే వీటి సంఖ్య అధికం కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో డెంగ్యూ జ్వర బాధితుల సంఖ్య పెరగడంతో అధికార యంత్రాంగం సైతం అప్రమత్తమవుతోంది. వీటి నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. సంబంధితశాఖల ఉన్నతాధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ నివారణకు చేపట్టాల్సిన కార్యాచరణపై సూచనలు చేశారు. ప్రజల్లో అవగాహన కోసం బ్రిడింగ్ చక్కర్స్ నియామకంతో పాటు అర్బన్ డెంగ్యూ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఏటా వర్షాకాలం రాగానే జిల్లాలో వివిధ రకాల జ్వరాలు ప్రబలడం సాధారణంగా మారుతోంది. కొత్త నీరు రావడం..పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడం కారణంగా దోమలు వృద్ధి చెంది వివిధ రకాల జ్వరాలు వ్యాప్తి చెందేందుకు కారణమవుతున్నాయి. వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్, మలేరియా తదితర జ్వరాల భారినపడుతున్నారు. వీటితో పాటు గొంతునొప్పి, జలుబు, కాళ్లనొప్పులు, తదితర వాటితోనూ అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా గత నెల నుంచి వైరల్ జ్వరాలతో దాదాపుగా ఇంటికొకరు చొప్పున బాధపడుతుండగా.. ఏజెన్సీ ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో 80మంది శాతం మంది వివిధ రకాల జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తూ అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. మరోపక్క పారిశుధ్య లోపం కారణంగా దోమలు వృద్ధి చెంది జ్వరాల వ్యాప్తిని నివారించడం సాధ్యం కావడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణంలో డెంగ్యూ జ్వరాలు విజృంభించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజుల క్రితం వరకు 24వరకు డెంగ్యూ జ్వరాలు నమోదు కాగా.. తాజాగా వీటి సంఖ్య 34కి చేరడం ఆందోళనకంగా మారింది. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం డెంగ్యూ కేసులు 59వరకు నమోదయ్యాయి. 2022సంవత్సరంలో 207 డెంగ్యూ కేసులు నమోదు కాగా.. 2023 ఏడాదికి వచ్చే సరికి వీటి సంఖ్య తగ్గుముఖం పట్టి 108 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో అనేక మంది చిన్నారులు ఈ డెంగ్యూ బారినపడుతున్నారు. ప్లేట్‌లెట్లు పడిపోతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి ఆయా ఆస్పత్రుల్లోనే ఉంటూ చికిత్సలు తీసుకుంటున్నారు.



నివారణకు ప్రత్యేక ప్రణాళిక..!

ఆదిలాబాద్ పట్టణంలో డెంగ్యూ జ్వరాలు పెరిగిపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. వైద్యఆరోగ్యం, మున్సిపల్, మెప్మా తదితర శాఖల అధికారులతో సమీక్షించిన ఆయన నివారణ కోసం పలు సూచనలు చేశారు. మరోపక్క వీటిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అర్బన్ యాక్షన్ ప్లాన్ పేరిట ప్రత్యేక ప్రణాళిక రూపొందించడమే కాకుండా 20మంది బ్రీడింగ్ చక్కర్స్‌ను నియమించనున్నారు. వీరు ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఐదు నెలల పాటు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించనున్నారు. జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే డెంగ్యూ జ్వరాలు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించడంతో పాటు డ్రైడే నిర్వహించడం, స్రేయింగ్ చేయించడం, జనాల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతారు. ఒక్కో సభ్యుడు కనీసం వంద ఇండ్లకు అవగాహన కల్పించనున్నారు.

జ్వరాలతో మన్యం విలవిల..!

ఆదిలాబాద్ పట్టణంలో డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతుంటే.. మిగితా పల్లె ప్రాంతాల్లో మాత్రం వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్య లోపం ఉన్న గ్రామాల్లో ఏకంగా 80శాతం మంది ఈ జ్వరాల బారినపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ సమస్య మరింత అధికంగా కనిపిస్తోంది. పరిసరాలు అస్తవ్యస్తంగా ఉండటం.. పారిశుధ్య లోపం కారణంగా అనేక మంది వివిధ రకాల జ్వరాలబారినపడుతున్నారు. ముఖ్యంగా కొన్ని గ్రామాల ప్రజలు తాగడానికి బావి నీటితో పాటు చేతిపంపులను సైతం వినియోగిస్తుండటం మూలంగా జ్వరాలు సోకడానికి కూడా కారణమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రయివేటులోనూ వందల సంఖ్యలో జ్వర బాధితులు చికిత్సలు తీసుకుంటున్నారు. జ్వరం త్వరగా తగ్గడంతో పాటు సౌకర్యాలు ఉంటాయనే కారణంగా అనేక మంది ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వివిధ రకాల టెస్టులు, బెడ్ ఛార్జీల రూపంలో చెల్లించాల్సి రావడంతో అనేక మంది పేదలు ఆర్థికంగానూ చితికిపోవాల్సిన పరిస్థితి వస్తోంది.

నివారించేందుకు కృషిచేస్తున్నాం : డా.మెట్‌పెల్లివార్ శ్రీధర్, జిల్లా మలేరియా అధికారి



జిల్లాలో జ్వరాలను అదుపు చేసేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశంతో పట్టణంలో నమోదవుతున్న డెంగ్యూ జ్వరాలను అదుపు చేసేందుకు బ్రీడింగ్ చక్కర్స్ నియామకంతో పాటు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ఈ జ్వరాలు ప్రబలే విధానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

మంచిర్యాల వాసికి ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలోని టేకుమట్ల గ్రామానికి చెందిన గణముక్కల మహేష్‌కు రెండు అత్యుత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డులు దక్కాయి. 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారు నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ఫొటో జర్నలిజం విభాగంలో మొదటి ప్రైజ్ 'ఫుట్ మార్క్' అనే ఫొటోకి దక్కింది. ఈ ఫొటోలో రెండు చేతులు లేని వ్యక్తి ఓటు వేస్తూ తన ఖాళీ బొటనవేలుకి ఓటు వేసినట్లుగా సిరా చుక్క పెట్టమని చూపిస్తున్న దృశ్యం. ఈ అవార్డును ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నాగార్జున యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.గంగాధర్‌రావు, జర్నలిజం విభాగ అధిపతి జి.అనిత, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా మహేష్ అవార్డు అందుకున్నాడు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన న్యూస్ ఫొటోగ్రఫీ ఫొటోల్లో 'ఏపీపీజేఏ అచీవ్మెంట్ అవార్డు' 'ప్రౌడ్ బ్రదర్' అనే ఫొటోకి గెలుచుకున్నారు. ఈ ఫొటోలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పవన్ కళ్యాణ్‌ను చిరంజీవి ఆప్యాయంగా ముద్దు చేస్తున్న దృశ్యం ఆకట్టుకుంటుంది. మహేష్ కొన్ని సంవత్సరాలుగా ఇంగ్లీష్ దినపత్రిక టైమ్స్ ఇండియాకి సీనియర్ ఫొటో జర్నలిస్టుగా సేవలు అందిస్తూ విజయవాడలో ఉంటున్నారు.



అవార్డు అందుకుంటున్న మహేష్



మహేష్ తీసిన ఫొటోలు

వికలాంగులకు జిల్లా కేంద్రంలో స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

- 27న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఎన్‌పీఆర్‌డీ జిల్లా ఉపాధ్యక్షుడు ఫసియోద్దీన్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో వికలాంగులకు స్వయం ఉపాధి కల్పన కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు ఎండి.ఫసియోద్దీన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా 2వ మహాసభ ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాసభల్లో జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో 5శాతం వికలాంగులకు కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో ర్యాంపులు నిర్మించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్నా వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఏడుపాయల దేవస్థానం పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తు చేసిన వారికి పరికరాలు, వివాహ ప్రోత్సాహం వెంటనే మంజూరు చేయాలన్నారు. సదరం స్లాట్ బుకింగ్ 200కు పెంచాలన్నారు. 21రకాల వైకల్యాలకు సర్టిఫికెట్స్ ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రంలో వికలాంగుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. ప్రయివేట్ విద్యా సంస్థల్లో వికలాంగుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు పెన్షన్ చెల్లించాలని, వికలాంగులకు ఈజీఎస్ పథకంలో జాబ్‌కార్డు మంజూరు చేసి 150 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. బాసర దేవస్థానం కమిటీలో వికలాంగులకు అవకాశం కల్పించాలని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో పార్కింగ్, క్యాంటిన్స్ వికలాంగులకు కేటాయించాలని మహాసభలో తీర్మానాలు ఆమోదించామని పేర్కొన్నారు. వీటి సాధన కోసం జిల్లా వ్యాప్త ఉద్యమాలు చేస్తామని తెలిపారు. అందులో భాగంగా 27న కలెక్టర్ కార్యాలయం ఎదుట సమస్యలపై ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.



ఎన్‌పీఆర్‌డీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఎన్‌పీఆర్‌డీ(జాతీయ వికలాంగుల హక్కుల వేదిక) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా టి.శంభు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేశ్వర్, అధ్యక్షులుగా ఫసియోద్దీన్, ఉపాధ్యక్షులుగా నేరెళ్లి రాజు, కార్యదర్శిగా ఆర్.రాజేష్, సహాయ కార్యదర్శిగా పోసాని ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా షేక్ మహమూద్, భోజవ్వ, రాధను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు..పరిస్థితి విషమం



నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్వరీ చర్చి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మందమర్రి ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు నవనందుల మల్లేశ్(22), బైరినేని భద్ర(18) అక్కడికక్కడే మృతి చెందారు. బైరినేని శంకర్(32) తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం కరీంగనర్ డెయిరీ పాల ప్యాకెట్లను అందుగులపేట గ్రామంలో లేలాండ్ గూడ్స్ వాహనంలో లోడ్ చేసుకొని ఊరు మందమర్రికి చెందిన బైరినేని భద్ర, అందుగులపేటకు చెందిన నవనందుల మల్లేశ్, బైరినేని శంకర్ అందుగులపేట నుంచి బెల్లంపల్లికి తీసుకెళ్తున్నారు. సోమగూడెం కల్వరీ చర్చ్ సమీపంలో డ్రైవర్ మల్లేశ్ వాహనాన్ని అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన గల కల్వర్టు సైన్ బోర్డు, స్పీడ్ లిమిట్ బోర్డు, కల్వర్టులను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వాహన డ్రైవర్ నవనందుల మల్లేశ్, బైరినేని భద్ర అక్కడికక్కడే మృతి చెందారు. బైరినేని శంకర్‌కు తీవ్ర గాయాలు కాగా బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాల నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కాంగ్రెస్‌ది నియంత పాలన

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-తలమడుగు

రుయ్యాడి గ్రామ రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం నియంత పాలనను తలపిస్తోందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం రుయ్యాడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని గ్రామస్తులు, రైతులు బీఆర్ఎస్ నాయకులు కలిసి సీఎం దిష్టిబొమ్మను ఊరేగించారని తెలిపారు. దీనిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వానికి సోయి ఉండి రైతుల మీద ప్రేమ ఉంటే రుణమాఫీ చేయాలి కానీ ప్రభుత్వానికి నిలదీస్తే అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రైతులపై ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే సంపూర్ణంగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నేటికీ 40 శాతం రైతుల రుణాలు మాఫీ కాలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. రుయ్యాడి గ్రామ రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కేసులైన వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. విలేకరుల సమావేశంలో అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, కన్వీనర్ వెంకటేష్, సుదర్శన్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాసరెడ్డి, అభిరామిరెడ్డి పాల్గొన్నారు.

అస్సాం అటవీ శాఖ అధికారులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అస్సాం రాష్ట్రానికి చెందిన అటవీ శాఖ అధికారులకు వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ జిల్లా అడవుల్లో అరుదుగా కనిపించే పక్షుల గురించి సోమవారం అవగాహన కల్పించారు. కొలువులో కొత్తగా చేరి 45 రోజుల శిక్షణా నిమిత్తం అధికారులు అస్సాం రాష్ట్రం నుంచి తెలంగాణకు వచ్చారు. రాష్ట్ర అటవీశాఖ శిక్షణా కేంద్రం నుంచి ఆదిలాబాద్ జిల్లా మీదుగా మహారాష్ట్రలోని తడోబా పులుల సంరక్షణ కేంద్రానికి వెళ్లే క్రమంలో జిల్లా కేంద్రంలోని మావల హరిత వనంలో ఆగి వనం తీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం లింగంపల్లి కృష్ణను పక్షుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ జిల్లా అడవుల్లో అరుదుగా కనిపించే పక్షి చిత్రాలను వారికి చూపించి వాటి ఆవశ్యకత గురించి వారికి వివరించారు. అదేవిధంగా అడవుల్లో ఉండే చెట్లు, పుట్టలు, వన్యప్రాణుల గురించి కూడా తెలియజేశారు. అడవుల్లో ఉండే పక్షులు, వన్యప్రాణుల గురించి కృష్ణ చేస్తున్న పనిని ఎంతో మెచ్చుకుంటూ మంత్ర ముగ్ధులయ్యారు. వారి వెంట ఎఫ్ఆర్ఓ సుభాష్, ఆదిలాబాద్ ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్ ఉన్నారు.

బాలుర వసతి గృహాల్లో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాల్లో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి విద్యార్థులను రక్షించేందుకు ముందస్తు బయోలార్వా స్ప్రేని చేయించడం జరుగుతుందని కార్యదర్శి ముజీబ్‌ఖాన్ తెలిపారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్స్ చిన్నయ్య, నారాయణ ఉన్నారు.



అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలను తెలియజేస్తూ వినతులు ఇచ్చారు. కొన్ని సమస్యలపై అప్పటికప్పుడు అందుబాటులో లేని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిశీలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అబిగ్యాస్ మలవీయ, అదనపు కలెక్టర్ శ్యామలదేవి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-తలమడుగు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో రుణమాఫీ లబ్ది పొందిన రైతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ రైతుల పక్షాన నిలిచిందని అన్నారు. రైతు రుణమాఫీపై ఇతర పార్టీలు అవగాహన లేక పూర్తి వివరాలు తెలుసుకోకుండానే రైతులను రెచ్చగొడుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకి రుణమాఫీ వస్తుందని అన్నారు. ముందుగా డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, బాబన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగారెడ్డి, మాజీ ఎంపీపీలు లక్ష్మీ రాజేశ్వర్, శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విలాస్ యాదవ్, రాజు, ప్రఫుల్‌రెడ్డి, పోతారెడ్డి, వెంకన్న యాదవ్, నరేష్, అశోక్, రఘు, సాంబశివ్, ప్రతాప్, తిరుపతి, రఫీక్, పోతన్న, నారాయణ, రాంచందర్ దేశ్‌ముఖ్, బాబుఖాన్, గంగారాం, భీంపూర్ మండల నాయకులు అశోక్, రమేష్, అన్ను పటేల్, విలాస్ నడిపెన్న, రైతులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై కేసులు సరికాదు

నవతెలంగాణ-తాంసి

రుణమాఫీ కానీ రైతులు నిరసన చేస్తే, ఆ రైతులపై కేసులు నమోదు చేయడం సరికాదని వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్వీనర్ మేకల నాగయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని చెప్పి హామీ ఇచ్చి, ఏ ఊరికి వెళ్తే ఆ ఊరి దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని అటు దేవుళ్లని ఇటు రైతులని నిండా మోసం చేసిన మొదటి సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రుణమాఫీ కానీ రైతులు నిరసనగా ధర్నాలు, ఆందోళనలు చేస్తే వారిపై అక్రమ కేసులు పెట్టడం ఇది సీఎం స్థాయికి తగదన్నారు. ఇప్పటికైనా రైతులకు క్షమాపణలు చెప్పి రైతు రుణమాఫీ కానీ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అమాయక రైతులపై అక్రమ కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో పార్టీలకు అతీతంగా రైతులందరం ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్, నాయకులు నరేందర్ యాదవ్, ముకుంద్, సంతోష్, గొల్లి లస్మన్న, భోజన్న, రాకేష్, ఉల్లాస్ పటేల్, మల్లెల స్వామి, శ్రీకాంత్, ఎల్చుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

'రూపాయి కూడా రుణమాఫీ కాలేదు'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్న తమకు మాత్రం ఇప్పటి వరకు రూపాయి కూడా మాఫీ కాలేదని, ఇంద్రవెల్లి మండలం ధనోర(బి) గ్రామ రైతులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో 350 మంది రైతులున్నారని, అందరి అకౌంట్లు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఉన్నాయని అన్నారు. తమకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని విన్నవించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అకౌంట్లలో ఇబ్బంది ఉందని, నెల రోజులోపు సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంద్రవెల్లి వ్యవసాయశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి ధనోర(బి) గ్రామంలో రైతుల వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలంలోని ధనోర(బి), ఇన్‌కర్ గూడ, శంకర్‌గూడ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. తమ గ్రామంలోనే దాదాపు 350 మంది రైతులున్నారన్నారు. అడిట్ జరగని కారణంగా సాంకేతిక సమస్యలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారన్నారు. తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించడంతో ఆయన సానుకూలంగా స్పందించి, ఏఈఓతో గ్రామాల్లో సర్వే నిర్వహించి, పరిష్కరించేలా చూస్తామని, హామీ ఇచ్చారన్నారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార దిశగా పని చేయాలని అధికారులకు సూచించారు. అర్జీదారుల నుంచి స్వీకరించిన రెవెన్యూ సమస్యలపై నేరుగా తహసీల్దార్లతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. వచ్చిన అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో డీఆర్ఓ భుజంగరావు, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం : ఏపీఓ

నవతెలంగాణ-ఉట్నూర్



గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఏపీఓ వసంతరావు అధికారులను సూచించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పింఛన్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో గురుకులం ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను భయాందోళనకు గురిచేయొద్దు

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బోర్రన్న



నవతెలంగాణ-తలమడుగు

కేసుల పేరుతో రైతులను భయాందోళనకు గురిచేయొద్దని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బోర్రన్న అన్నారు. సోమవారం మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన రుణమాఫీ కానీ రైతులతో కలిసి వారిపైన పెట్టిన కేసుల గురించి సోమవారం గ్రామ రైతులతో మాట్లాడారు. కేసుల పేరిట రైతులను భయాందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం గత వరంగల్ డిక్లరేషన్‌లో 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ 9 వరకున్నటువంటి ప్రతి రైతుకి పట్టా పాస్‌బుక్ ఆధారంగా రూ.2లక్షలను పంట రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. రైతులు వివిధ బ్యాంకులలో పంట రుణాలను తీసుకున్నారని తీసుకున్న పంట రుణాన్ని రూ.2లక్షలు మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకో లేదన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీఓ నెంబర్ 567 ప్రకారంగా ప్రతి రైతుకి రేషన్ కార్డు నిమిత్తం లేకుండాపట్టా పాస్ బుక్ ఆధారంగానే రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాటలు నమ్మి బలికారని అన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకులలో రైతులు అప్పు తీసుకున్న రైతుల సంఖ్య 1లక్ష 17 వేల ఖాతాలున్నాయని, ఆయా బ్యాంకులలో 90 వేల మంది రుణాలు తీసుకున్నట్లు వ్యవసాయశాఖ ఇచ్చిన సమాచారం ఆధారంగానే మొదటి విడుతలో 18,821మంది రైతులకు రూ.120.79కోట్లను జమ చేసిందన్నారు. రెండో విడుతలో 17,647 మందికి రూ.201.89 కోట్లలను విడుదల చేసిందని అన్నారు. మూడో విడుతలో 19,493 మంది రైతులకి రూ.286.26 కోట్లలను మాఫీ చేసిందన్నారు. ప్రస్తుతం 55వేల 961 మంది రైతులకి రూ.608.88 కోట్ల నిధులను మాత్రమే పంట రుణమాఫీ చేసిందని తెలిపారు. ఇంకా పంట రుణమాఫీ కానీ మిగిలిన రైతులకు సంఖ్య 34వేల 39 మంది రైతులకు పంట రుణమాఫీ కానటువంటి పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా రైతులకి ఆర్థిక భరోసా కల్పించే విధంగా రైతులు తీసుకున్న అప్పులను మాఫీ చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట గ్రామ రైతులు నిమ్మల సుదర్శన్‌రెడ్డి, సూర్యసేనరెడ్డి, భూమన్న, గంగాధర్, పోతారెడ్డి, సతీష్‌రెడ్డి పలువురు రైతులు ఉన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

- మాల మహానాడు పిలుపు



నవతెలంగాణ-ఉట్నూర్

భారత ఉన్నత న్యాయస్థానం ఎస్సీలను వర్గీకరించాలని తీర్పు చెప్పడాన్ని నిరసిస్తూ, మాల మహానాడు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం భారత్ బంద్ నిర్వహించాలని, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి దాసండ్ల ప్రభాకర్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత కొన్ని రోజుల కింద సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా ధర్నాలు సైతం చేయడం జరిగిందని, మాలలు, మాల ఉపకులాల ఆధ్వర్యంలో సుప్రీం తీర్పు నిరసిస్తూ, ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 341 ఆర్టికల్ విధి విధానాలను పాటించకుండా ముందుకు వెళ్లడం సరైంది కాదన్నారు. ఒక కులాన్ని తీయాలన్నా, చేర్చాలన్న పార్లమెంట్‌లో చర్చించి, రాష్ట్రపతికి బిల్లు పంపించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలో కూడా తీర్మానాలు ఆమోదించి, కేంద్రానికి పంపించాల్సి ఉంటుందని అన్నారు. తాము ఇస్తున్న బంద్ పిలుపుకు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు సహకరించి బంద్‌ను పాటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు నిరంతర ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో కాటం రమేష్, గొల్లపల్లి నర్సయ్య, తౌటి ఆశన్న, దూట రాజేశ్వర్, బొంకంటి సుభాష్, సతీష్, దూట మహేందర్, కోడి ప్రభాకర్ రావు, వినోద్, ఎర్రదండి సుశీల్, అచ్చనందం, రాజు పాల్గొన్నారు.

తలమడుగు : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 21న దేశవ్యాప్తంగా భారత్ బంద్ పిలుపునిచ్చిన సందర్భంగా మాల కులస్తులు, ఉపకులాలు భారత్ బంద్‌లో పాల్గొని, జయప్రదం చేయాలని మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షులు క్రాంతి కుమార్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 21న చేపట్టే బంద్‌లో రాజకీయ నాయకులు, వ్యవసాయదారులు, విద్యావంతులు పాల్గొన్నారు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంపూర్ణంగా బంద్‌కు పిలుపునివ్వడం జరుగుతుందని అన్నారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి అన్ని గ్రామాల వారు కుల సంఘాల నాయకులు రాజకీయ నాయకులు వ్యవసాయదారులు విద్యావంతులు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు నేతుల గంగన్న, సురేందర్, ఎలుగు ఆనంద్ పాల్గొన్నారు.

అనుబంధాలను పంచుకుంటూ ముందుకు సాగాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్న చెల్లెల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండగను పురస్కరించుకొని మాజీ మంత్రి జోగు రామన్న సోమవారం ఒక ప్రకటన ద్వారా రాఖి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి కుటుంబంలో ఆనందోత్సాహల మధ్య రాఖీ పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, ఇదే ప్రేమానురాగాలతో ప్రతి ఒక్కరూ అక్క, అన్న, చెల్లి అనుబంధాలను పంచుకుంటూ ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ముందుకు సాగాలని ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎంపీకి రాఖీ కట్టిన మాజీ మున్సిపల్ చైర్మెన్ ...

అన్నచెల్లెల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణిమను పురస్కరించుకొని పలువురు ఎంపీకి రాఖీలు కట్టారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, పాత హౌజింగ్ బోర్డులో ఎంపీ నివాసానికి వచ్చి రాఖీ కట్టారు. అదే విధంగా పలువురు మహిళలు, పార్టీ నాయకురాళ్లు ఎంపీ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ అన్నచెల్లెల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ అని అన్నారు.

రాఖీతో సందడిగా మారిన బస్టాండ్...

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణం రద్దీగా మారింది. అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు ఆడపడుచులు ప్రయాణానికి సిద్ధమయ్యారు. సోమవారం పుట్టింటికి వెళ్లడానికి ఆర్టీసీ బస్టాండ్ లో బస్సుల కోసం ఎదురుచూశారు. ఫ్రీ బస్సు ప్రయాణం కావడంతో మహిళలతో బస్టాండ్ కిటకిటలాడింది. ఉదయం నుంచే బస్సుల్లో ప్రయాణాలు ప్రారంభించారు. ఆర్టీసీ అధికారులు కూడా సమయానుసారంగా బస్సులను నడిపారు.

కలెక్టర్‌కు రాఖీ కట్టిన బహెన్..

రక్షాబంధన్‌ను పురస్కరించుకొని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ బహెనీలు జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో పాటు అధికారులకు రాఖీలు కట్టారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో రేవతి బహెన్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో పాటు శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, అధికారులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా రేవతి బహెన్ కలెక్టర్ పలు సూక్తులతో కూడి జ్ఞాపికను అందించారు.

ఆదిలాబాద్‌రూరల్ : అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకైనా రాఖీ పౌర్ణమిని ఆదిలాబాద్, మావల మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రాఖీ పండగను ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ మాసంలో వచ్చే ఈ పండగ రోజున అక్కచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కడుతారు.





బాలిక దుర్గాకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

నవతెలంగాణ-నిర్మల్

తానూర్ మండలం బేల్‌తరోడ గ్రామానికి చెందిన బాలిక దుర్గాకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లి ఆత్మహత్యతో అనాధగా మారిన దుర్గకు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి బాలిక చదువుతో పాటు భవిష్యత్ అవసరాలు, సదుపాయాలు కల్పించేలా అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క రూ.50వేలు, మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి బాలికతో మాట్లాడి బాలిక పేరు మీద లక్ష రూపాయలను ఫిక్స్ డిపాజిట్ చేయించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి అన్ని విధాలుగా ధైర్యం చెప్పి, ఓదార్చరని తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీఓ, బాలల సంరక్షణ అధికారులు గ్రామంలో బాలికను కలిసి ధైర్యం చెప్పడంతో పాటు అంగన్‌వాడీ సిబ్బందితో నిత్యావసర సరుకులను అందించడం జరిగిందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తక్షణ సహాయంగా అంత్యక్రియల కోసం పది వేల రూపాయలను అందజేయడం జరిగిందన్నారు. బాలికకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

గ్రామీణ బ్యాంకు సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకులో రక్షాబంధన్ సందర్భంగా రైతులకు, మహిళలకు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని, మధ్యవర్తులు లేకుండా వచ్చి బ్యాంక్ అధికారులను సంప్రదించాలని, రైతులు ప్రతి సంవత్సరం క్రాప్‌లోన్స్ రెన్యువల్ చేసుకుంటే వడ్డీ రాయితీ వస్తుందని, బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలు ఆదాయ కార్యక్రమాల కొరకు వాడుకొని సక్రమంగా తిరిగి చెల్లించాలని సూచించారు. మహిళా సంఘాలు పంచసూత్రాలు పాటించాలని, ఒక్కో సంఘం రూ.20 లక్షల వరకు రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు మేనేజర్ ప్రహ్లాద్‌కు, స్థానిక ఎస్సై అప్పారావుకు, బ్యాంకుకు వచ్చిన రైతులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గణేష్, గ్రామస్తులు జల్కే పాండురంగ్, చట్ల ఉత్తం, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో 185వ ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా లూయిస్ డాగురె చిత్రపటానికి పట్టణ ఫోటోగ్రాఫర్స్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రఫీ సమస్యల గురించి, ఫోటోగ్రాఫర్ల సమస్యల గురించి మాట్లాడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానం చేసి నిర్ణయించారు. అనంతరం తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దొడ అశోక్, కోశాధికారి సంతోష్, కార్యదర్శి విశాల్, మురళీధర్ హౌజ, అనిల్ దేశ్‌పాండే, కత్తూరి కిరణ్ కుమర్, పట్టణ ఫోటోగ్రాఫర్లు విశాల్, రమేష్, సంజయ్, రాజు, జనార్ధన్ పాల్గొన్నారు.

ఎడ్‌బిడ్ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మీషన్ భగీరథ ఎఈఈ దుర్గం సుమన్‌కు విధి నిర్వహణలో ఆటంకం కలిగించిన ఘటనలో పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన రాజారెడ్డిలపై ముధోల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 15న ఎడ్‌బిడ్ గ్రామంలో ఉన్న మీషన్ భగీరథ పంపు హౌజ్‌లో పని చేసే వాటర్ మెన్ ప్రభాకర్(36) గుండె పోటుతో మృతి చెందాడు. అయితే మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చెప్పట్టిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎఈఈ దుర్గం సుమన్ సంఘటన స్థలానికి వెళ్లారు. దీంతో సురేందర్‌రెడ్డి, రాజారెడ్డిలు దాడిచేశారు. విధులకు ఆటంకం కల్గించటంమే గాక, ప్రజలను రెచ్చగొట్టి, నాపై దాడికి పాల్పడ్డారని, ఎఈఈ దుర్గం సుమన్ ముధోల్ పోలీస్ స్టేషన్ ఘటన జరిగిన రెండు రోజులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎస్సై సాయికిరణ్ విచారణ చేపట్టారు. ఎఈఈ ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై 132 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు అయినట్టు పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉండగా మృతుని కుటుంబానికి న్యాయం చేయటానికి ప్రయత్నం చేస్తే, కావాలని కేసులు పెట్టడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు.

రాఖీ కట్టడానికి వచ్చి మృతువు ఒడిలోకి చేరిన అక్క



నవతెలంగాణ-ఖానాపూర్

తన తమ్ముడికి రాఖీ కట్టడానికి వచ్చి అక్క సదర్మాట్ లెఫ్ట్ కెనాల్‌లో కాలుజారి పడి మృతి చెందిన సంఘటన ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన రాళ్లబండి చిన్నమ్మ (70) దిలావర్‌పూర్ గ్రామంలో ఉన్న తన తమ్ముడు రసమల్ల బద్దయ్యకు 18న రాఖీ కట్టడానికి వచ్చింది. 19న ఉదయం 6 గంటల సమయంలో గ్రామ శివారులో ఉన్న సదర్మాట్ లెఫ్ట్ కెనాల్ వద్దకు కాలకృత్యాలు కోసమని వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి కెనాల్ లో పడిపోయింది. అనుమానం వచ్చిన బంధువులు వెతుకుతుండగా పాత ఎల్లాపూర్ గ్రామ శివారులోని సైఫన్ గేటు వద్ద ఆమె మృతదేహం లభించింది. మృతురాలికి ముగ్గురు కుమారులు కాగా ఒక కొడుకు చనిపోగా ఒక కొడుకు విదేశాలలో ఉన్నాడు. ప్రస్తుతం తన రెండో కొడుకు రాళ్లబండి ముత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఖానాపూర్ ఎస్సై జి.లింబాద్రి తెలిపారు.

నవతెలంగాణ

3

కుమురంభీం ఆసిఫాబాద్

మంగళవారం | 20 ఆగస్టు, 2024 | www.navatelangana.com

పిడుగుపడి ఎద్దు మృతి

- రైతుకు స్వల్ప అస్వస్థత

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని ఖర్జీ గ్రామంలో పిడుగు పాటుకు గురై సోమవారం దనోరి అంజన్నకు చెందిన ఎద్దు మృతి చెందింది. సోమవారం బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం ఉదయాన్నే తన పంట చేనులో ఎద్దును మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగుపడింది. ఎద్దు అక్కడికక్కడే మృతి చెందిందగా రైతు స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటి తర్వాత స్పృహలోకి వచ్చిన రైతు చూడగా ఎద్దు మృతిచెంది ఉంది. ఆర్థికంగా నష్టపోయిన తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

వృద్ధాశ్రమంలో పుట్టిన రోజు వేడుకలు

నవతెలంగాణ-రెబ్బెన



తన పుట్టిన రోజు వేడుకలను వృద్ధాశ్రమంలో జరుపుకొని నేటి తరం యువతకు మంచి సందేశాన్ని ఇచ్చారు మండల కేంద్రానికి చెందిన తెజేశ్విని. ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా గోలేటి వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి బట్టలు, చెప్పులు అందించారు. అనంతరం వృద్ధాశ్రమం ముందు ఒక చెట్టును నాటి సంరక్షించాలని నిర్వాహకులను కోరారు. వృద్ధుల క్షేమం కోరుతూ వారికీ తోడుగా ఉంటూ అంతా నావల్లే అని వారికీ ఎంతో సేవ చేస్తున్న తెజేశ్వినికీ వృద్ధాశ్రమం తరుపున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఆశీర్వాదించారు.

రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు



నవతెలంగాణ-చింతలమానెపల్లి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ముందస్తు సమాచారం మేరకు ప్రధాన రహదారిపై తనిఖీ నిర్వహిస్తుండగా బురే పల్లి గ్రామానికి చెందిన నక్క రవి, పెరుగు తిరుపతి అక్రమంగా మహారాష్ట్రకు ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న నాలుగు క్వింటల రేషన్ బియ్యంను బాబాపూర్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. మండలంలో బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన రౌతూ శంకర్ బోలోరా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని రవీంద్రణగర్ వద్ద అటుకునట్లు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఒక బోలోరో వాహనం సీజ్ చేసి ముగ్గురిపై వేరువేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి అభివృద్ధికి ఉద్యోగులు, కార్మికులు కృషి చేయాలని మార్కెటింగ్ జీఎంగా బదిలీపై వెళ్తున్న డి.రవి ప్రసాద్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి ఏరియా నూతన జీఎం ఎం శ్రీనివాస్, బదిలీపై వెళ్తున్న రవి పసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డి రవి ప్రసాద్ మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో సంవత్సరంలో నాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన అధికారులు, ఉద్యోగులు, పత్రిక విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సింగరేణి అభివృద్ధికి అందరూ కష్టపడి సింగరేణ సంస్థను కాపాడాలని కోరారు. అనంతరం ఉద్యోగోన్నతి పొందిన తిరుమల్ రావు, బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, రవి ప్రసాద్‌ను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాజమల్లు, ప్రాజెక్టు ఆఫీసర్స్ నరేందర్, ఉమాకాంత్, ఏరియా ఇంజనీర్ జాడే, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర పురపాలికల ముఖ్య కార్యదర్శి దాన కిషోర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్దిదారుడికి అందే విధంగా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పురపాలికల ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర మున్సిపల్ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), మున్సిపల్ కమిషనర్లతో లేఅవుట్ క్రమబద్ధీకరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, మహిళా శక్తి, స్వచ్ఛదనం-పచ్చదనం, వీధి కుక్కల నియంత్రణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలికల ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ లేఅవుట్ క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు అమలు చేయాలని, మహిళ అభివద్ధి దిశగా స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల మీడియా కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్యలతో కలిసి హాజరయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-వాంకిడి

మండల వ్యవసాయ నూతన అధికారిగా సోమవారం ఎస్ గోపికాంత్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండలంలో పనిచేసిన వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్ ఆసిఫాబాద్‌కు బదిలీ కాగా కెరమెరిలో పనిచేస్తున్న గోపీకాంత్ వాంకిడి మండల వ్యవసాయ అధికారిగా వచ్చారు. కాగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సామూహిక యజ్ఞోపవీతధారణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శ్రావణ జంజాల పౌర్ణమి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆలయంలో ఆలయ అర్చకుడు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ అమ్మవారి అభిషేకం చేసినంతరం భక్తులతో సామూహిక యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. ఈ సందర్భంగా జంజాల పౌర్ణమి పవిత్రతను వివరిస్తూ జంజాల పౌర్ణమి నాడు ప్రతి ఒక్కరు జంజాలు మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్న వివేక్, ఏకీరాల శ్రీనివాస్, రావుల నారాయణ మూర్తి, సుధాకర్, మధుకర్, గణపతి, నవీన్, జీవన్ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

- మహిళలతో కిక్కిరిసిన రోడ్లు బస్టాండ్లు
- రాఖీ కట్టిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఆసిఫాబాద్ : కేటీఆర్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అన్న చెల్లెలు అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి జిల్లా కేంద్రంలో సందడి కనిపించింది. మహిళలు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రానికి రావడం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో రోడ్లు కిక్కిరిసి కనిపించాయి.

మహిళలతో కిక్కిరిసిన రోడ్లు బస్టాండ్లు

ఉదయం నుండి రాఖీలు కట్టడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి వస్తున్న మహిళలతో జిల్లా కేంద్రం కిక్కిరిసిపోయింది. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ నుండి బస్టాండ్ వరకు రోడ్డు మధ్యలో రాఖీల దుకాణాలు తోపుడుబండ్లలో పెట్టడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కాగా రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లే మహిళలతో ఇతర ప్రాంతాల నుండి వచ్చే మహిళలతో ప్రయాణ ప్రాంగణంతో పాటు, బస్సులు కూడా కాలు పెట్టే పరిస్థితి లేకుండా తయారైంది.

ఆర్టీసీ అధికారుల ప్రత్యేక ఏర్పాట్లు

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో మహిళల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు అదనపు బస్సులు నడిపించారు. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే బస్సులు కిటకిటలాడుతుండగా రాఖీ పౌర్ణమితో బస్సులలో ఎక్కువగా మహిళలు కనిపించారు. ఆసిఫాబాద్ డీఎం విశ్వనాథ్ మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న కార్మికులు పండుగలు పెండ్లిల నేపథ్యంలో అదనపు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని అదనపు బస్సులు నడుపినట్లు తెలిపారు.



ఆసిఫాబాద్ : సందడిగా మారిన మార్కెట్

రాఖీ కట్టిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

రాఖీ పౌర్ణమి వేడుకలు పురస్కరించుకొని ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్‌కు రాఖీ కట్టి అనంతరం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.

దహెగాం : మండలంలో రాఖీపౌర్ణమి వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం రాఖీపౌర్ణమి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అక్కాచెళ్లెల్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం అక్కాచెళ్లెలు అన్నదమ్ములను ఆశీర్వదించగా అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లకు కట్నకానులకు అందజేశారు. మండలంలోని కల్వాడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో రక్షాబంధన్ సందర్భంగా విద్యార్థులకు కాంగ్రెస్ యువ నాయకుడు, గ్రామకమిటీ అధ్యక్షుడు హట్కర్ మధుకర్ ఆధ్వర్యంలో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

తిర్యాణి : మండలంలోని మహిళలు రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం అక్కాచెల్లెల్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అనంతరం అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లకు కట్నా కానుకలు అందజేశారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రాఖీపౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. అన్నదమ్ములు, అక్కాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పండుగ రాఖీపౌర్ణమి. ఉదయం నుండే తమతమ ఇండ్లలో అన్నదమ్ములకు అక్కాచెల్లెల్లు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అనంతరం అన్నదమ్ములు అక్కాల్లెల్లకు కట్నకానుకలు అందజేశారు.



దహెగాం : విద్యార్థులకు రాఖీ కడుతున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు మధుకర్



వాంకిడి : రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రాజేందర్

నవతెలంగాణ-కెరమెరి

మిషన్‌భగీరథ కార్మికులకు పెండిగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జాధవ్ రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మిషన్ భగీరథ కార్మికులతో కేస్లాగూడ పంప్‌హౌజ్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించిన పలుమార్లు విన్నవించిన యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల వేతనాలు సక్రమంగా చెల్లించని కారణంగా కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలల పాటు వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. వేతనాలు చెల్లించని పక్షంలో ఈనెల 21 నుండి సమ్మె బాట పట్టానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బుద్దయ్య, అంకుష్ సోను, చరణ్, సిద్దు, తిరుపతి, రాందేవ్, శంకర్, అల్తాఫ్, ఇమ్రాన్ ఖాన్, సంతోష్ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

- మంత్రి శ్రీధర్ బాబును కోరిన ఎమ్మెల్యే హరీష్ బాబు

నవ తెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 6 సంవత్సరాలుగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికులకు దక్కాల్సిన రాజ్యాంగబద్ధ హక్కులను కోల్పోతున్నారన్నారు. ఎన్నికలు నిర్వహించక యాజమాన్యం కూడా వారి హక్కులను కాలరాస్తోందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రపంచ ఫొటోగ్రఫీ 185వ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కాగజ్‌నగర్‌లో ఫొటో గ్రాఫర్లు వేడుకలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీ ల్యాబ్‌లో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్ర పటనికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వాలు ఫొటోగ్రాఫర్ల సమస్యలను గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫొటో మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

ఒడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామపంచాయతీలో ఒడ్డెర సంఘం మండల కమిటీ ఎన్నుకున్నారు. వడ్డెర సంఘం గౌరవ అధ్యక్షులు బోదాసు వెంకన్న కమిటీని ఆదివారం గోలేటి గ్రామంలోని కూరగాయల మార్కెట్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రాపాక వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఒల్లెపు తులసిరాం, మహిళా మండల అధ్యక్షురాలిగా దేవర్ల స్వరూప, ఉపాధ్యక్షురాలిగా రాపాక సమ్మక్కను ఎన్నుకున్నట్లు ప్రకటించి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర కులస్తులు వెంకటస్వామి, సమ్మయ్య, సంతోష్, శ్రీను, పోశం రమేష్, పుల్లపు దేవరాజ్, వీరయ్య, సుజాత, విజయ లక్ష్మి, వనజ, పోశక్క, గంగప్ప, వీరమ్మ, వెంకటమ్మ, లలిత, పుల్లపు నిర్మల పాల్గొన్నారు.



ఘనంగా పాపన్న గౌడ్ జయంతి



నవతెలంగాణ-రెబ్బెన

బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి, బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌లి 374వ జయంతిని మండల కేంద్రంలోనీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మోడెమ్ సుదర్శన్ గౌడ్, జువ్వజి అనిల్ గౌడ్, కేసరి ఆంజనేయ గౌడ్, అన్నపూర్ణ, అరుణ, మురళి గౌడ్, మోడెమ్ సర్వేశ్వర గౌడ్, మోడెమ్ చిరంజీవి గౌడ్, కేసరి కిషన్ గౌడ్, మోడెమ్ సుదర్శన్ గౌడ్, బొడిగెల ఉమేష్ గౌడ్, తల్లపెల్లి కిస్టా గౌడ్, అరిగెల భాస్కర్ గౌడ్, గొల్లపెల్లి సాయికిరణ్ గౌడ్, రమగౌని సృజన గౌడ్, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, చెన్న సోమశేఖర్, పేసరు మధునయ్య, మద్దెల సురేందర్ రాజు, బొమ్మినేని శ్రీధర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఓకు సన్మానం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలో పనిచేసిన వ్యవసాయ అధికారి జాడె మిలింద్‌కుమార్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా మండల రైతులు ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలో రైతులకు అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలు పరిష్కరించి అనేక సేవలందించారని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల ఏకాదశదీక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

శ్రావణమాసం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 100 మంది హనుమాన్ భక్తులు ఏకాదశ దీక్షలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శిరీష్ శర్మ గణపతి నవగ్రహ పూజ చేసినంతరం అభిషేకం నిర్వహించి వారికి మాలధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు మనిషి నిత్య జీవితంలో అనేక తప్పులు చేస్తాడని అన్నారు. అటువంటి నిత్యజీవిత తప్పులకు దూరంగా ఉండటంతో పాటు దేవునిపై మనసు లగ్నం చేసే విధంగా దీక్ష ఉపయోగపడాలన్నారు. దీక్ష కాలంలో నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులకు సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేష్‌లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, అర్జీ దారులు పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకించడం సరికాదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఏండ్ల పోరాటం తరువాత ఎస్సీవర్గీకరణ కళ సాధ్యమైందని, కానీ దీన్ని కొందరు వ్యతిరేకిండం సరికాదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబాసాహెబ్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల తీర్పును వ్యతిరేకించడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
మంగళవారం | 20 ఆగస్టు, 2024 | www.navatelangana.com

రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తాం

నవతెలంగాణ-జన్నారం



రైతులకు అందుబాటులో ఉంటు వ్యవసాయంలో లాభాలు సాధించేలా నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేస్తానని మండలంలోని చింతగూడ క్లస్టర్ నూతన ఏఈఓ కాంద్రపు లవన్ కుమార్ అన్నారు. సోమవారం చింతాకూడా క్లస్టర్ ఏఈఓగా బాధ్యతలు స్వీకరించినంతరం, రైతు వేదికలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. చింతగూడ క్లస్టర్ పరిధిలోని అన్ని గ్రామాల రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని మేదరపేట గ్రామానికి చెందిన పొన్నం వంశీ కృష్ణ(22) అనుమన్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతుని కుటుంబానికి సిద్ధం అంజయ్య అనే వ్యక్తికి ఇల్లు నిర్మాణం విషయమై గొడవలున్నాయి. కోర్టులో సైతం కేసు నడుస్తుంది. ఇదే క్రమంలో వంశీకృష్ణ ఆదివారం రాత్రి అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. అనుమానాలున్నట్లు మృతుని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో మునిగి ఇద్దరు యువకుల మృతి

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గంధం చరణ్(18), అల్లాటి అజయ్(19) యువకులు గోదావరిలో నదిలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని ద్వారకలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కొండాపూర్ గ్రామానికి చెందిన ఫాస్టర్ శామ్యూల్ మృతుల చరణ్ అజయ్‌లతో పాటు మరో కొంతమంది గోదావరి నదికి స్నానాని కెళ్లారు. నదిలో స్నానం చేస్తుండగా యువకులకు ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందారు. తల్లిదండ్రులు వారి కుమారుల మృతిపై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

కాసిపేట 2 ఇంక్లైన్ గనిని సందర్శించిన జీఎం



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట 2 ఇంక్లైన్ గనిని మందమర్రి ఏరియా నూతన జీఎం జి. దేవేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా గని అధికారులు, యూనియన్ నాయకులు జీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. గని మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ముందుగా గని కార్యాలయంలో వివిధ మ్యాప్లు, ప్లాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం దేవేందర్ మాట్లాడుతూ రోజు వారిగా సాధిస్తున్న ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని, ఎల్లప్పుడూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఉద్యోగులు, అధికారులకు సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీ నారాయణ, పిట్ ఇంజనీర్ రఘు, ఐఎన్టీయూసీ పిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ చింతం రవి కిరణ్, ఏరియా నాయకులు గొల్ల రాజేందర్, చింతల సత్తయ్య, రాంటింకి మల్లేశ్, సమ్మయ్య, ప్రేంకుమార్, శ్రావణ్ పాల్గొన్నారు.

జిల్లాలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. సోమవారం కేంద్ర హోశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని అసంపూర్తి నిర్మాణాన్ని బీసీ బాలికల హాస్టల్‌కు కేటాయించాలని కోరారు. దండేపల్లి ప్రభుత్వ కళాశాల శిథిలావస్థలో ఉన్నందున నూతన నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. అలాగే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు.

భార్యను హత్య చేసిన భర్త

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన ఆవుల విమల(28) మహిళను భర్త ఆవుల నరేష్ పొయ్యి గొట్టంతో కొట్టి హత్య చేసినట్లు దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన విమలకు నరేష్‌తో పది సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. భార్య, భర్త మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో ఇరువురికి సర్ది చెప్పారు. ఇదే క్రమంలో విమలపై ఆగ్రహం పెంచుకున్న నరేష్ ఆదివారం రాత్రి పొయ్యిలో ఉన్న గొట్టంతో తలపై కొట్టడంతో విమల అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు మృతురాలు తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.



సీసీసీలో నీటి సరఫరా మెరుగు పర్చాలి

నవతెలంగాణ-నస్పూర్

సీసీసీలోని సింగరేణి క్వార్టర్స్‌కు నీరు సరఫరా మెరుగుపరచాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల ఇళ్లల్లో నీరు సరిగా సరఫరా కాక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు, నాలుగు రోజుల నుండి అయితే పూర్తి అధ్వాన్నంగా నీరు వస్తుందని ఆరోపించారు. నీరు సరఫరా అయినప్పుడు ఇంటిలోని పైపుల నుండి సన్నటి దార వలె వస్తుందన్నారు. ఏండ్ల తరబడి పైపులు మార్చక పోవడం వల్ల పైపులకు రంధ్రాలు పడి క్వార్టర్‌లకు నీరు సరఫరా కాకుండా వృథాగా పోతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైపులను మార్చి నీటి సరఫరా మెరుగుపరచాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి పూర్వవిద్యార్థులే కీలకం

- సంస్కారం నేర్పేవే శిశుమందిరాలు
- కొన్ని ప్రభుత్వాలు పాఠ్యాంశాలను మార్చే కుట్ర చేస్తున్నాయి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- రాంపూర్ ఆవాస విద్యాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తున్న బండి సంజయ్

నవతెలంగాణ-హాజీపూర్

పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారమే కీలకమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. సంస్కారం లేని చదువుకు సార్థకత ఉండదన్నారు. శిశుమందిరాలు చదువుతో పాటు సంస్కారాలు కూడా నేర్పుతున్నాయన్నారు. ఈ విద్యాలయాల్లో చదువుకున్న వారికి సమాజంపై అవగాహన, సేవా గుణంతో పాటు దేశభక్తి పెంపొందుతుందన్నారు. ప్రస్తుత కాలంలో విద్య నిర్బంధమైందన్నారు. కార్పొరేట్ చదువులకి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఎక్కడ ఎక్కువ ఫీజు ఉంటే అదే పెద్ద సంస్థ అంటూ తల్లితండ్రులను ఆ కార్పొరేట్ సంస్థల్లో విద్యార్థులను చేర్పుతున్నారు కానీ అక్కడ ఓ ఆట పాట ఉండదని, ర్యాంకులు, డబ్బు సంపాదన కోసమే కొన్ని సంస్థలు విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కొన్ని ప్రభుత్వాలు పాఠ్యాంశాలను మార్చే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. దాని ద్వారా విద్యార్థులు పెన్నులకు బదులు గన్నులు పట్టుకునే ప్రమాదముందని పేర్కొన్నారు. ఇటీవల బంగ్లాదేశ్ పరిస్థితులను చూస్తే ఇక్కడ ఉత్పన్నం కాకుండా విద్యార్థులు సంఘటితం కావాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, మాధవరపు వినయ్ ప్రకాశ్ రావు, సుధాకర్ రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. కాగా సీబీఎస్ఈ పాఠశాల నిర్మాణానికి రూ.కోటి విరాళం అందించిన ఎన్నారై అమర్‌ను సన్మానించారు.

వినతుల వెల్లువ..

బండి పర్యటన సందర్భంగా పలువురు వినతిపత్రాలు సమర్పించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి వినతిపత్రం ఇచ్చారు. నూతనంగా నిర్మించే ఎన్‌హెచ్ 63లో భూములు కోల్పోతున్న బాధితులు వినతిపత్రం ఇవ్వగా కనీసం స్పందించ లేదని నిరుత్సాహ పడ్డారు. కాన్వాయి నీ ఆపే ప్రయత్నం చేయగా పోలీస్ సిబ్బంది అడ్డుకుని కాన్వయ్ ముందుకు నడిపించారు.

గట్టి పోలీస్ బందోబస్తు..

కేంద్ర హోం సహాయ మంత్రి పర్యటన సందర్భంగా పోలీస్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. డీసీపీ ఎగ్గని భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బందోబస్త్‌లో ఏసీపీ ప్రకాశ్, సీఐలు అశోక్, సుధాకర్, నరేష్, ఎస్సై గోపతి సురేష్ పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ను జిల్లా నుండి బహిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీకి చెందిన 21వ వార్డు కౌన్సిలర్ బీర సత్యనారాయణను జిల్లా నుండి బహిష్కరించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఆయన వల్ల నష్టపోయిన అంజయ్య, రొడ్డ రాజేశం, సందేల శశి కుమార్, జాడి శ్రీనివాస్, చింతల రామానుజం, శివరామయ్య, చిలువేరు శ్రీనివాస్, చిలువేరు కిరణ్, తిప్పని భీమయ్య సోమవారం సీసీసీ కార్నర్‌లో రాస్తారోకో నిర్వహించారు. వీరి రాస్తారోకోకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ సురిమిల్ల వేణు మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. తను చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి పోలీసులు, ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. సత్యనారాయణపై రౌడీషీట్ తెరిచి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక కేసు విషయంలో మంచిర్యాల ఏసీపీ ఆఫీసులో విచారణ జరుగుతుండగా కోడి కత్తి డ్రామా ఆడి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, పోలీస్ అధికారులను బద్నామ్ చేసేందుకు ప్రయత్నం చేశాడని బాధితులు ఆరోపించారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ సీసీసీ కార్నర్‌కు చేరుకున్నారు. బాధితులతో చర్చలు జరిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారు. దీంతో వారు రాస్తారోకో విరమించారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

అప్పుల్లో సింగరేణి సంస్థ : ఏఐటీయూసీ



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ రంగయ్య

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య పేర్కొన్నారు. సోమవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ రూ.29 వేల కోట్లు అప్పులో కూరుకుపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ అప్పులు దశలవారీగా తీర్చాలని నూతన బొగ్గు బ్లాక్లను ప్రారంభించాలన్నారు. బొగ్గు బావులు, ఓసీలు 10 నుండి 15 సంవత్సరాల్లో మూత పడే అవకాశమున్నందున కొత్తగా ఉద్యోగంలో చేరిన యువతకు ఎక్కడ పని చేయాలో తెలియలేని పరిస్థితిలో ఉందన్నారు. ఒక పక్క కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రయివేటు చేస్తుంటే మరో పక్క నూతన బొగ్గు బ్లాకు రాకపోవడం వల్ల ప్రమాదం ఉందన్నారు. ఏఐటీయూసీని గుర్తింపు కార్మిక సంఘంగా కార్మికులు ఎన్నుకున్నా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. గ్రీన్, ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని రద్దు చేపించామన్నారు. సీఎం పీఎఫ్ చిట్టీలు రెండు సంవత్సరాల ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీ నారాయణ, ఎస్ నాగేశ్వరరావు, రంజిత్ కుమార్, చిప్పరి శ్రీహరి, వి.రాజేందర్, పార్వతి సురేష్, లింగయ్య, కొక్కెర సంతోష్, ఐ.సంపత్, ఆడెపు రవీందర్, వియ్యాల రాజన్న, మహేందర్, జాడిశంకర్, లక్ష్మణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే పండుగ రక్షాబంధన్‌ను మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న అకచెల్లెల్లు తమ గ్రామాలకు చేరుకున్నారు. అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టి తమ సోదరీ, సోదర భావాన్ని చాటుకున్నారు. స్వీట్లు పంచుకుని రక్షాబంధన్ శుభాంక్షలు తెలుపుకున్నారు.

ప్రొఫెసర్ కోదండరాంకు రాఖీ కట్టిన ఆత్రం సుగుణక్క

రక్షా బంధన్ సందర్భంగా..ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క రాఖీ కట్టారు.హైదరాబాద్ లోని కోదండరాం నివాసానికి వెళ్లిన సుగుణక్క ఆయనకు రాఖీ కట్టి మిఠాయి తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షా, ఇతర నాయకులకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అభ్యర్థి అజ్మత్ ఖాన్, దాసరి గణేష్, కామెర రాకేష్, సాయి నాయక్, తిరుపతి, రఘువర్ధన్, రాజేష్ సాయిబాబా, నాగరాజ్, శివకేష్, బన్నీ పాల్గొన్నారు.

దండేపల్లి : అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ సోదర ప్రేమకు ప్రతిరూపం విలువలు సాంప్రదాయం ఆత్మీయత అనురాగాలు స్నేహానికి ఈ రక్షాబంధన్ పండగ పెట్టింది పేరు. సోమవారం మండల ప్రజలు ఆనందోత్సవాల మధ్య రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎన్నో పనులు ఉన్నా వాటన్నింటిని పక్కనపెట్టి తన సోదరునికి రాఖీ కట్టాలని ఎంతో దూరం నుంచి ఆడపడుచులు పుట్టింటికి వస్తుంటారు సోదరునికి నోరు తీపి చేసి రాకి కట్టిన తరువాత వారి ఆనందాలకు హద్దే లేదు రాఖీ కట్టినందుకు అక్కాచెల్లెళ్లకు కట్నకానుకలు సమర్పించారు.





రక్షాబంధన్ కాదు ఇది వృక్షా బంధన్



నవతెలంగాణ-నస్పూర్

రాఖీ పండుగ అంటే సోదర సోదరీమణులు ఒకరికొకరు రక్షగా ఉండాలని ప్రతీకగా రక్షాబంధన్ జరుపుకుంటారు. సోదరీమణులు ప్రేమతో సోదరులకు రాఖీ కట్టి సంబరాలు జరుపుకుంటారు. పర్యావరణ ప్రేమికులు వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని సంరక్షిస్తాయని శ్రీరాంపూర్ ఏరియాలోని హిమ్మత్ నగర్‌లో పర్యావరణాన్ని కాపాడేందుకు వృక్ష బంధన్ అనే కార్యక్రమాన్ని అక్క చెల్లెల్లు మమత, మల్లేశ్వరిలు చేపట్టారు. పర్యావరణ మీద ఉన్న ప్రేమతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటి ఆవరణలో ఒక మొక్కను నాటి దానికి రాఖీని కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోదరి సోదరీమణుల మధ్య ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉన్న ప్రేమను ఈ రక్షాబంధన్ ద్వారా తెలియపరుస్తారని, అలాగే ప్రకృతి మానవుల మధ్య కూడా అలాంటి బంధం కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించిన వారమవుతామని తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



నవ తెలంగాణ-మందమర్రి

ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్‌లో 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్ర పటానికి పూలమాల వేసి జెండా వందనం చేశారు. 1989 నుండి ఫొటో గ్రాఫర్లందరినీ ఏకతాటిపై తెచ్చి కృషి చేసిన బెల్లంపల్లి సీనియర్ ఫొటోగ్రాఫర్ వావిలాల రాజన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయులు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్లకొండ కనుకయ్య గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్, కోశాధికారి బద్రి సతీష్, ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రమేష్, నక్క పవన్, కార్యదర్శి పగిడి రాజలింగు, ప్రచార కార్యదర్శులు కందుకూరి శ్రీకాంత్, బన్ని, శివ, కేశవేణి, హరికృష్ణ, కార్యనిర్వహణ కార్యదర్శులు సల్లూరి శంకర్, వంశీ కామెర గణేష్, మాధురి వెంకటస్వామి, కామెర మహేందర్, విక్టరీ అశోక్, వరుణ్, జయశంకర్, మంచిర్యాల పట్టణ అధ్యక్షులు అసంపల్లి రాజబాబు, రవి పాల్గొన్నారు.

వెదురు ఉత్పత్తులపై నిషేధం ఎత్తివేయాలి

నవతెలంగాణ-జన్నారం



వెదురు ఉత్పత్తులు మీద అల్లికల మీద నిషేధం ఎత్తివేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ కోట్నాక తిరుపతిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదురు ఉత్పత్తులను అల్లికలను ఫారెస్టు అధికారులు నిర్బంధిస్తున్నారని, వాటిపై ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. టైగర్ జోన్‌నీ వెంటనే రద్దుచేసి ఇక్కడ ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. అదే విధంగా పోడు భూములకు పట్టాలివ్వాఅలని, విద్య వైద్యం అందని మారుమూల ఆదివాసీ గూడలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అడవిలో వెదురు సేకరణ కోసం వెళ్లే వారిపై ఫారెస్ట్ అధికారుల దాడులను నిలిపివేయాలని కోరారు. చెక్ పోస్టుల వద్ద వెదురుతో చేసిన అల్లికలను పట్టుకొని సీజ్ చేస్తున్నారని, చలాన్ వేస్తున్నారని వెదురు నిషేధ పదార్థం కాదని, కాబట్టి వెదురు అల్లికలను ఆపకూడదన్నారు. వెదురు ఉత్పత్తుల మీద ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి రుణాలు మంజూరు చేయలని విన్నవించారు. అంతరించిపోతున్న వెదురు జాతి కళ రూపాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కాసిపేటలో ప్రజావాణి



నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా భూమికి సంబంధించిన పెద్దనపల్లికి చెందిన మేడ చంద్రయ్య అర్జీ ఇవ్వగా ఎంపీఓ సఫ్దర్ అలీ స్వీకరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, ఆర్ఐ శ్వేతా రెడ్డి, ఈజీఎస్ ఈసీ మల్లేశ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దీక్షా గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని కొత్తపెల్లి-హెచ్ జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ దీక్ష భూమి ఆలయంలో సోమవారం లంబాడీల బంజారాల దీక్ష గురు పీఠాధిపతి ప్రేమ్‌సింగ్ మహరాజ్ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భోగ్ భండార్ పూజలు చేసి ప్రవచనం చేశారు. అనంతరం భక్తులు దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నాయకులు అజ్మీరా శ్యాంనాయక్, జాదవ్ శ్రీరామ్ నాయక్, బంజారా జిల్లా నాయకులు జాదవ్ రెడ్డి నాయక్, ఆడే సురేష్, నారాయణ్, బానాత్ గజానంద్ నాయక్, విశ్వనాథ్ ఉన్నారు.

నవతెలంగాణ

5

ఆదిలాబాద్

మంగళవారం | ఆగస్టు 20, 2024 | www.navatelangana.com

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని బీఆర్.అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షులు సొస్ కాంబ్లె మనోహర్ అన్నారు. సోమవారం అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్ని రోజులు కలిసి మెలిసి ఉన్న మాల, మాదిగల మధ్య వర్గీకరణ పేరుతో చిచ్చు పెడుతున్నారన్నారు. వర్గీకరణతో కొన్ని వర్గాలకు లాభం, మరికొన్ని వర్గాలకు నష్టమే జరుతుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన బంద్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వాఘ్మారే కామరాజ్, ఉపాధ్యక్షులు శివాజీ, కోశాధికారి సునీల్, రాజవర్ధన్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో భారీ వర్షం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో సోమవారం మధ్యాహ్నం ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి, సోయా తదితర పంటల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో పంట పొలాల్లో గడ్డి పెరిగింది. వర్షం తరచూ పడుతుండడంతో కలుపు తీయడం భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి అధికమౌతోందని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పున్న శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన శరత్ బదిలీపై వెళ్లారు. దండేపల్లి ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ వాగ్దానాల అమలు కోసం చలో హైదరాబాద్

వతెలంగాణ-బోధన్

ప్రభుత్వ హామీల అమలు కోసం 22వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం హామీల అమలు కోసం ఈ నెల 22వ తేదీన సి.పి.ఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలని, సొంత స్థలాలున్నవారికి ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వారికి డబ్బులు బెడ్ రూమ్‌లు ఇవ్వాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలని, బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా కటాఫ్ తేదీని తొలగించి కొత్త పెన్షన్లను మంజూరు చేయాలని, రైతాంగానికి రెండులక్షల రుణమాఫీలో మాఫీ కాని వారందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని, రైతు భరోసాకు 20 ఎకరాల వరకు గల రైతులను ఎంపిక చేసి, 10 ఎకరాల వరకు రైతు భరోసాను ఇవ్వాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలని, వ్యవసాయ కార్మికులకు ఎన్నికల్లో వాగ్దానం చేసిన ప్రకారం 12 వేల రూపాయల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని, జీవన వ్యయానికి అనుగుణంగా పెంచాలని, అసంఘటిత కార్మికులకు సెలవులతో కూడిన కనీస వేతనాలను అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ రెగ్యులరైజ్ చేయాలని, స్కాలర్‌షిప్స్‌ను, ఫీజు రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని, నిరుద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం ప్రకటించి, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలను, సాగుహక్కులను కల్పించాలని, ఆటో కార్మికులకు ఏడాదికి 12,000 ఇచ్చి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, బోయిడి శంకర్, గంగాధర్, ఐఎఫ్‌టీయూ నాయకులు సలీం, పోశెట్టి, గంగాధర్, బాలరాజ్, శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్టడీ సెంటర్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానంద స్టడీ సెంటర్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని శిశుమందిర్‌లో పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న యువతీ యువకుల కోసం ఏర్పాటు చేసిన వివేకానంద స్టడీసెంటర్‌ను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంతటి గొప్పకార్యాన్ని నిర్వహిస్తున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘాన్ని అభినందిస్తూనే, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి తన వంతుగా ఆర్థికంగా సహకరిస్తానని హామీనిచ్చారు. తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పట్ల నిరంతరంగా ఉద్యమిస్తూనే భావితరాలకు ఉపయోగపడే ఈ కార్యక్రమం చేయడం పట్ల కమ్మర్‌పల్లి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కార్యవర్గాన్ని అభినందించారు. వివేకానంద స్టడీ సెంటర్ నిర్వహణ కోసం భవనాన్ని సమకూర్చిన శిశు మందిర్ యాజమాన్యాన్ని అభినందించారు. అంతకుముందు వివేకానంద స్టడీ సెంటర్‌ను ఎస్ఐ అనిల్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సుంకెట రవి, పిల్లి ఈశ్వరయ్య, తపస్ మండల అధ్యక్షులు కిషన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమేష్, డివిజన్ కార్యదర్శులు ఆనంద్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాల ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్, కోనాపూర్ గ్రామాల్లో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాఖీ పూర్ణిమను పురస్కరించుకొని సంఘం భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కోనాపూర్ పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చిలువేరి సత్య నారాయణ, దైవశెట్టిగా చిలివేరి గణేష్ ఎన్నికయ్యారు. నాగాపూర్ పద్మశాలి సంఘం నూతన అధ్యక్షులుగా అంబల్ల అరవింద్, ఉపాధ్యక్షులుగా చౌట్‌పల్లి విట్టల్, కార్యదర్శిగా బొడ్డు రవిచంద్, దైవశెట్టిగా చిలుక దిలీప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గ సభ్యులకు సహచర సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి మండలంలోని అన్ని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కట్టారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యార్థినులు రాఖీ కట్టారు. ఉపాధ్యాయులు రాఖీ పౌర్ణమి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, వార్డెన్ వనిత, పీడీ ఆడే విశ్వనాథ్, పిఎస్‌హెచ్ ఎం.శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరడిగొండ : శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు రాఖీ పండగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సోమవారం సరస్వతి శిశు మందిర్ పాఠశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో విద్యార్థులు రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులను ఒక వరుసలో కూర్చోబెట్టి మరో వరుసలో విద్యార్థినులను కూర్చోబెట్టి విద్యార్థులకు విద్యార్థినులతో రాఖీ కట్టించి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు మీనా మాట్లాడుతూ రక్షాబంధన్ అంటే అన్నాచెల్లెళ్లకు ప్రతిరూపమని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుమలత, అరుంధతి, గంగా కళ్యాణి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : మహిళలు తోడబుట్టిన సోదరులకు రాఖీలు కడుతూ రక్షగా ఉండాలంటూ జరుపుకునే రాఖీ పండుగను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరుపుకున్నారు. మహిళా పోలీస్ సిబ్బంది పోలీసు అదనపు ఎస్పీ, డిఎస్పి అధికారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ బి సురేందర్‌రావు, డిఎస్పి పోతారం శ్రీనివాస్‌కు ఏఎస్ఐలు జైస్వాల్ కవిత, వెంకటమ్మ రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

'కంది' ఇంట రాఖీ సంబరాలు...

అన్నాచెల్లెళ్ల అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు చిహ్నమైన రాఖీ పౌర్ణమిని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. రక్షాబంధన్ పండగ రోజు కంది శ్రీనివాస రెడ్డి చెల్లెళ్లు రాఖీ కట్టి హారతి ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీ కట్టిన అక్కయ్యలకు కంది దంపతులు పాదాభివందనం చేసి దీవెనలు అందుకున్నారు. తమ సోదరుడు మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకున్నారు. ప్రేమతో రాఖీ కట్టిన సోదరీమణులను శ్రీనివాసరెడ్డి కానుకలతో సత్కరించారు.



ఒక్క చిత్రం అనేక జ్ఞాపకాలను భద్రపరుస్తుంది

- జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

ఒక్క చిత్రం మానవ జీవితంలో అనేక జ్ఞాపకాలను భద్రపరిచి, గుర్తు చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతీలాల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో లయన్స్ క్లబ్-మంచిర్యాల, లయన్స్ క్లబ్-గోల్డెన్ జూబ్లీ, లయన్స్ క్లబ్-హైటెక్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కెమెరా ద్వారా బంధించిన ఒక్క చిత్రం మానవ జీవితంలో ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుందని, ఎన్నో సంతోషాలను తిరిగి ఇస్తుందని అన్నారు. 18వ శతాబ్దంలో నలుపు, తెలుపు రంగులతో ప్రారంభమైన ఫొటోలు నేడు ఎన్నో రంగులతో మరిన్నో జ్ఞాపకాలను బంధించి భద్రపరుస్తున్నాయని అన్నారు. ఫొటోగ్రఫీలో ఫొటోలు తీయడం అద్భుతమైన కళ అని, ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యంతో చిత్రీకరించి మానవ జీవితంలో సంతోషకరమైన ఘటనలను భద్రపరచుకునేలా అందిస్తారని తెలిపారు. ఈ క్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లు మంత్రి సునీల్‌కుమార్(జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ ఫొటోగ్రాఫర్), మాదరబోయిన శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ), బెక్కం సదానందం(వెలుగు)లను శాలువా, మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు రాకేష్‌రెడ్డి, విశ్వనాథ్, మధుసూదన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, చంద్రమౌళి, కొత్త సురేందర్, హనుమంతరావు, నాగేందర్ పాల్గొన్నారు

వాగులో కొట్టుకుపోయి రెండెద్దులు మృత్యువాత

నవతెలంగాణ-సారంగాపూర్

వాగులో రెండెద్దులు కొట్టుకుపోయి మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని ధూప్యా తండాలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ధూప్య తండా గ్రామానికి చెందిన రాథోడ్ రంజిత్ కుమార్ తన పంట చేను సమీపంలో వాగు వద్ద ఎద్దులను మేపుతుండగా పైన





అటవీ ప్రాంతంలో అధిక వర్షం కురిసింది. ఒక్కసారిగా వరద రావడంతో రెండెద్దులు వరదనీటిలో కొట్టుకపోయి మృత్యువాత పడ్డాయని, బాధిత రైతు తెలిపాడు. ఎద్దుల విలువ రూ.80 వేల ఉంటుందన్నారు. బాధిత రైతుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి, ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పార్కింగ్‌కారులో నుంచి నగదు చోరీ

- కేసులో నలుగురు నిందితుల అరెస్ట్
- 24 లక్షల నగదు, 2 బైకులు, 4 ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-తాండూర్

ఈనెల 17న బెల్లంపల్లిలో పార్కింగ్ కారులో నుంచి రూ.28 లక్షల దొంగిలించిన కేసులో నలుగురు నిందితులను బెల్లంపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బెల్లంపల్లి 1 టౌన్ సీఐ దేవయ్య అధ్వర్యంలో నిందితులను పట్టుకోవడానికి నాలుగు ప్రత్యేక మైన పోలీస్ టీం లను ఏర్పాటు చేసి నిందితులు ప్రయాణించిన మార్గాలలోని సీసీ టివిలను పరిశీలించి వాటి ఆధారంగా పట్టుకున్నారని ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. నిందితులు పటాలవత్ దాసు, జోగు పోతలు శివ, ముప్పూరు రాజు, పండుగ రాజు ఉన్నారన్నారు. హైదరాబాద్‌కు చెందిన దాసు కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఫిర్యాదు దారుడు బిపిన్ కుమార్ వ్యాపారి వద్ద కార్ డ్రైవర్‌గా చేరాడు. అదే సమయంలో కలెక్షన్ వివరాలు తెలిసిన డ్రైవర్ డబ్బు దొంగలించి జీవితంలో త్వరగా స్థిర పడొచ్చని దొంగలించారన్నారు. ఫిర్యాదు అందించిన వెంటనే సీసీ టివి ఫుటేజిల ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకున్నామన్నారు.



ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో బెల్లంపల్లి ఆర్‌డీఓ హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గూడెం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్న కేంద్రమంత్రి



నవతెలంగాణ-దండేపల్లి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజీపూర్ మండలం రాంపూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరవడానికి వెళ్తూ మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామిని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సరిహద్దు గూడెం వద్ద బిజెపి శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం హాజీపూర్ మండలంలో కార్యక్రమానికి తరలి వెళ్లారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

- గ్రామ పటేల్ హెచ్‌కే జంగు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కోలకత్తాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రామ పటేల్ హెచ్‌కే జంగు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో గ్రామస్తులతో శాంతియుత క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యురాలిని అత్యంత పాశవికంగా హత మార్చిన దుండగుడిని బహిరంగంగా ఉరితీయాలన్నారు. దేశంలో ఆడపడుచులకు రక్షణ కరువైందని, అత్యాచారం, మానసిక ఒత్తిడిలకు గురి చేసే నిందితులను కఠినంగా శిక్షించేలా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు అమలు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్రం రాంచందర్, తెలంగరావ్, కేంద్రే జ్ఞానేశ్వర్, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలాజీ, దూబేకార్ శివాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే గురుకుల హాస్టల్, ఆశ్రమ హాస్టల్‌లలో విద్యార్థులకు ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో రాఖీ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ముషే, రాజన్న, నాగరాజు వర్మ, వేముల మధు, ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, ఉపాధ్యాయులు, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

